ఆటోల డిజిటలైజేషన్‌తో మేలు

- ప్రయాణికుల భద్రతతో పాటు నేర పరిశోధనలోనూ ఉపయుక్తం
- ఆరేళ్ల క్రితం నిలిచిపోయిన కార్యక్రమాన్ని కొనసాగించాలంటూ వినతి

తెనాలిరూరల్: ఆటోలలో లేదా ఆటోల ద్వారా జరిగే నేరాల దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేయడం, ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురైతే వెంటనే స్పందించేందుకు వీలుండేలా ఆటోల సమగ్ర వివరాలను నమోదు చేసి, కంప్యూటరీకరించాలని పోలీసులు ఆరంభించిన చర్యలు ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాలేదు. ఆరేళ్ల క్రితం ఆర్భాటంగా ప్రారంభించిన కార్యక్రమంలో ఇప్పటికీ 20 శాతం కూడా పూర్తి కాలేదు.

తెనాలి పట్టణంలో తిరిగే, పరిసర గ్రామాల నుంచి పట్టణానికి వచ్చే ఆటోల సంఖ్య దాదాపు ఐదు వేలు ఉంటుందని అంచనా ఉంది. ఆటోల చోరీ, లేదా ఆటోల్లోని వస్తువుల చోరీ వంటి ఘటనలు జరుగుతూ ఉంటాయి. ఇక ప్రయాణికుల లగేజీ /ఇతర విలువైన వస్తువులు ఆటోల్లో ప్రయాణిస్తుండగా జరిగిన దాఖలాలు ఉన్నాయి. అంతే కాక నేరం చేసిన అనంతరం ఆటోల్లో పరారైన ఘటనలూ ఉన్నాయి. ఇటువంటి కేసుల దర్యాప్తు కొంత క్లిష్టంగా ఉండేది. కేవలం ప్రయాణికులు, ఏదైనా ఘటన జరిగిన సందర్భంలో అక్కడి స్థానికులు ఆటోకి రవాణశాఖ కేటాయించిన రిజిస్ట్రేషన్ నంబరును గుర్తిస్తేనే దర్యాప్తు త్వరితగతిన పూర్తయ్యేది.


ఆటో వివరాలను నమోదు చేస్తున్న కానిస్టేబుల్

కనబడీ కనబడని విధంగా నంబర్ ప్లేట్‌లు ఉండడం వల్ల సంఖ్య గమనించలేకపోయేవారు. ఇటువంటి ఇబ్బందులకు పరిష్కారంగా కొన్నేళ్ల కిందట ఆటోల వివరాలను పోలీసులు నమోదు చేసి, వరుస క్రమసంఖ్య ఇచ్చారు. ఆటో యజమాని, డ్రైవర్ వివరాలు పోలీసుల వద్ద ఉండేవి. పోలీసులు కేటాయించిన క్రమసంఖ్యను ఆటోలో ముందు, వెనుక వైపుల స్పష్టంగా కనబడే విధంగా స్టిక్కరింగ్ వేయించే వారు. దీంతో కొంత వరకు కేసుల దర్యాప్తు సునాయాసమైంది. అంతే కాక, ప్రయాణికులు తాము ఎక్కిన ఆటోకు పోలీసులు ఇచ్చిన క్రమ సంఖ్యను తెలియజేస్తే, ఎటువంటి ఇబ్బంది తలెత్తినా, తగు చర్యలు తీసుకునే వారు.

టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో ఈ ఆటోల నమోదు ప్రక్రియను డిజిటలైజ్ (కంప్యూటరీకరించేందుకు) చేసేందుకు పోలీసు శాఖ గతంలో నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ప్రత్యేక పోర్టల్‌లో ఆటోల వివరాలను నమోదు చేశారు. ఆటో ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్ వంటి వివరాలను తెలుసుకుని, పోలీసు శాఖ ఆటోకొక సీరియల్ నంబరు కేటాయించి, ఆటో యజమాని, డ్రైవర్, వివరాలు, వారి ఆధార్, ఫోన్ నంబర్ల వంటి వ్యక్తిగత వివరాలు, ఫోటోలు, అవసరమైనప్పుడు సహాయం కోసం పోలీసు శాఖకు చేయాల్సిన ఫోన్ నంబర్లు వంటి వివరాలతో కూడిన స్టిక్కర్ /గుర్తింపు కార్డును పోలీసు శాఖ తయారు చేయించింది.. దీనిపై క్విక్ రెస్పాన్స్(క్యూఆర్) కోడ్‌ను ముద్రించారు. ఈ స్టిక్కర్‌ను ఆటో లోపలి వైపున డ్రైవర్ వెనుక భాగంలో ప్రయాణికులకు స్పష్టంగా కనబడే విధంగా ఉంచారు. పోలీసులు కేటాయించిన సీరియల్ నంబరును సైతం ఆటోలకు అంటించారు.


గతంలో పోలీసులు జారీ చేసిన గుర్తింపు కార్డులు

తెనాలిలో ఈ డిజిటలైజేషన్ కేంద్రాన్ని 2018లో మార్కెట్‌లోని గాడిబావి సెంటరు వద్ద ఏర్పాటు చేశారు. ఆరేళ్లు దాటుతున్నా ఇప్పటికీ 20 శాతం ఆటోల నమోదు ప్రక్రియ పూర్తి కాలేదు. ఇప్పుడు ఆ కేంద్రాన్నే మూసేశారు. ప్రయాణికులకు ఎంతో ఉపయోగంగా ఉండే ఈ కార్యక్రమాన్ని తిరిగి కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రయాణికుల భద్రతతో పాటు నేరపరిశోధనలో పోలీసులకు ఉపయోగకరంగా ఉండే డిజిటలైజేషన్‌ను కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏదైనా ప్రమాదం సంభవించినా, ప్రయాణికులు ప్రమాదం శంకించినా, ఆటో వెళుతున్న దారిపై అనుమానం కలిగినా వెంటనే ఆ స్టిక్కర్‌పై ఉన్న నంబరుకు ప్రయాణికులు ఫోన్ చేస్తే తక్షణమే పోలీసు శాఖ స్పందిస్తుంది. ఇప్పుడు ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటోంది. ఆ ఫోన్‌లు ఉన్న వారు స్టిక్కర్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆటోకు సంబంధించిన వివరాలన్నీ తెలుస్తాయి. రాత్రి వేళల్లో ప్రయాణించే వారు, ఒంటరిగా ఆటోల్లో వెళ్లాల్సి వచ్చిన వారు ఆటో వివరాలను తమ కుటుంబసభ్యులు, స్నేహితులకు తెలియజేస్తే, ఏదైనా అనుకోని ఘటన జరిగినప్పుడు వెంటనే స్పందించే వీలు కలుగుతుంది. కేవలం నేరాలు జరిగితే కేసుల దర్యాప్తును సునాయాసం చేయడమే కాక, ప్రయాణికులకు భద్రతతో పాటు భరోసా ఇవ్వడం, ఎన్ని ఆటోలు ఉన్నాయన్న ఖచ్చితమైన సంఖ్య తెలుసుకోగలగడం ఈ డిజిటలైజేషన్ ముఖ్య ఉద్దేశం.

తెనాలిలో మొరాయించిన పింఛన్ సర్వర్

5 గంటల పాటు నిలిచిన పంపిణీ


ఉదాకాలనీలో పెన్షన్ పంపిణీ పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: ఎన్‌టీఆర్ సామాజిక పెన్షన్ పంపిణీ కార్యక్రమం శుక్రవారం ఉదయం నుంచి తెనాలి పట్టణంలోని అన్ని వార్డులలో ప్రారంభమైంది. ఉదయం 6 గంటల నుంచే సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వాటిని పంపిణీ చేశారు. గంటకే సర్వర్ మొరాయించింది. మధ్యాహ్నం 12.15 నిమిషాల తరువాత సర్వర్ రావడంతో అప్పటి నుంచి సచివాలయ ఉద్యోగులు పింఛన్ పంపిణీని కొనసాగించారు. సుమారు 5 గంటల పాటు సర్వర్ నిలిచిపోవడంతో ఉద్యోగులు, లబ్ధిదారులు కొంత ఆందోళనకు గురయ్యారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఉడా కాలనీలో, అసిస్టెంట్ కమిషనర్ వీఎం.లక్ష్మిపతి 11వ వార్డులో పింఛన్లను పంపిణీ చేశారు. సాయంత్రం 6గంటల సమయాన్ని 94 శాతం పంపిణీ పూర్తయిందని మున్సిపల్ అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

పన్ను చెల్లింపుదారులు అప్రమత్తంగా ఉండండి

తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘ పరిధిలోని ఇంటి, ఖాళీ స్థలం పన్నులు, డీఅండ్‌ఓ ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించే వారు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. కొందరికి మోసపూరితమైన కాల్స్ వస్తున్నట్లు తెలిసిందన్నారు. పన్నులను ఆన్‌లైన్‌లో చెల్లించాలని బ్యాంకు వివరాలు, ఓటీపీలు అడుగుతున్నట్లు సమాచారం ఉందన్నారు. ప్రజలు ఇలాంటి మోసపూరిత కాల్స్‌కు రెస్పాండ్ కావద్దని మున్సిపాలిటీ నుంచి ఎటువంటి బ్యాంకుల వివరాలు, ఓటీపీలు అడగటం జరగదని చెప్పారు. ఇలాంటి కాల్స్ వస్తే వెంటనే కమిషనర్, రెవెన్యూ అధికారికి తెలియజేయాలని సూచించారు.

ఎండీయూ ఆపరేటర్‌పై కేసు నమోదుకు ఆదేశం



తెనాలిరూరల్: మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ ఆపరేటర్‌పై కేసు నమోదు చేయాలని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ఆదేశించారు. తెనాలిలో జరుగుతున్న రేషన్ పంపిణీని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. చినరావూరులో ఎనిమిదవ నంబరు ఎండీయూలో రేషన్ పంపిణీ జరిగిన వివరాలకు, వాహనంలో ఉన్న బియ్యంకు 450 కిలోలు వ్యత్యాసం ఉండడంతో వాహన ఆపరేటర్ కిరణ్‌పై కేసు నమోదు చేయాలని సీఎస్‌డీటీ మూర్తిని ఆదేశించారు. అలానే ఐతానగర్‌లో తొమ్మిదో నంబరు రేషన్ దుకాణానికి కేటాయించిన ఎండీయూ వాహనాన్ని తహసీల్దార్ రాకను పసిగట్టిన ఆపరేటర్ వాహన తలుపులన్నీ మూసేసి వెళ్లిపోయాడు. దీనిపైనా విచారించి నివేదిక సమర్పించాలని సిబ్బందిని ఆదేశించారు. రేషన్ సరుకులను పక్కదారి పట్టిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని తహసీల్దార్ హెచ్చరించారు.

పేదలకు అన్నదానం




తెనాలిఅర్బన్: ప్రముఖ న్యాయవాది హరిదాస్ శివప్రసాద్ 8వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన తమ్ముడు గౌరీశంకర్ ఆధ్వర్యంలో గురువారం రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ శివ లింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి అన్నదాన కేంద్రంలో పేదలకు అన్నదానం చేశారు. ముందుగా శివప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మామిడిబత్తుల సుబ్రమణ్యం, బండారు రవికాంత్, మట్టిపల్లి గోపాలకృష్ణ, గురివిశెట్టి శ్రీనివాస్, పోలిశెట్టి శివప్రసాద్, వై.శరత్, యార్లగడ్డ రవికుమార్, బండారు మధుసూదన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



కొల్లిపర: మైనర్ బాలుడు అతివేగంగా స్కూటీ నడిపి ఎదురుగా మరో బైకు పై వస్తున్న యువకుడిని ఢీ కొట్టిన సంఘటన శుక్రవారం రాత్రి కొల్లిపర బీసీ కాలనీ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. దావులూరు గ్రామంలోని నాగరాజు పాలెంకు చెందిన గాజుల తేజ అనే యువకుడు కొల్లిపర నుంచి దావులూరుకి వస్తుండగా దావులూరు అడ్డరోడ్డు లో నివాసం ఉంటున్న కుటుంబానికి చెందిన మైనర్ బాలుడు అడ్డరోడ్డు నుంచి కొల్లిపర వైపునకు వెళ్తూ అతివేగంగా గాజుల తేజను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తేజకు తలకు బలమైన గాయమవడంతో ప్రాథమిక చికిత్స అందించి తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు 108 ద్వారా తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే మైనర్ బాలుడి అక్కడి నుంచి స్కూటీ వదిలివేసి భయంతో పారిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు.

అండర్-19 యోగాలో సత్తా చాటిన రావెల జడ్పీ విద్యార్థిని



రావెల(తాడికొండ): రాష్ట్రస్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థిని పేరుబోయిన వెంకట త్రివేణి బంగారు పతకం సాధించిందని రావెల జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎస్‌వీ నాగమణి తెలిపారు. అక్టోబర్ 28-29 తేదీలలో అన్నమయ్య జిల్లా రాయచోటిలో నిర్వహించిన అండర్ 19 యోగా పోటీలలో పాల్గొని విజయం సాధించి బంగారు పతకానికి ఎంపిక కావడం గర్వకారణమన్నారు. త్వరలో మహారాష్ట్రలో జరగబోయే జాతీయస్థాయి పోటీలలో విద్యార్థిణి పాల్గొననుందని తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా పాఠశాలలో ఆయుష్ వైద్య విభాగం ఆధ్వర్యంలో శిక్షకుడు అన్నవరపు రాకేష్‌తో యోగా శిక్షణ అందిస్తున్నామని, గతంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పలు పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించగా ప్రస్తుతం రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించడం హర్షణీయమన్నారు.

దోమల లార్వాను నియంత్రించండి

తెనాలిఅర్బన్: దోమల లార్వాను నియంత్రించడం ద్వారా వాటి వ్యాప్తిని అరికట్టవచ్చని తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో సుల్తానాబాద్‌లోని కుమార్‌కాలనీలో శుక్రవారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఇంటింటి సర్వే నిర్వహించారు. వ్యాధుల వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్లి చూపించుకోవాలన్నారు. జ్వరాల పట్ల నిర్లక్ష్యంగా ఉండవద్దని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాల చంద్రమౌళి, పట్టణ సబ్‌యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, ఆరోగ్య పర్యవేక్షకులు దీపాల శ్రీనివాసరావు, బండారు నాగ మల్లేశ్వరరావు, దాసరి శివనాగ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ప్రభాకర్‌రెడ్డి

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచండి

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి

తెనాలిఅర్బన్: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మిపతి సూచించారు. పట్టణంలోని 7,9,10,11, 36, 37 వార్డుల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త సేకరణ సక్రమంగా జరిగే విధంగా చూడాలన్నారు. మురుగు కాల్వలను ప్రతిరోజు బాగు చేయాలని సూచించారు. అనంతరం సచివాలయంకు వెళ్లి ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కఠారి హరీష్, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.


కార్మికులతో మాట్లాడుతున్న ఏసీ లక్ష్మిపతి

కాలువలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్


గాయాల పాలైన డ్రైవర్ శివ

కొల్లిపర: మండల పరిధిలోని మున్నంగి గ్రామ సమీపంలో కృష్ణా నదిలో ఇసుక కోసం వచ్చిన ట్రాక్టర్ ప్రమాదవశాత్తు అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది దీనిపై స్థానికులు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కట్టు శివ మున్నంగి గ్రామం సమీపంలో కృష్ణానది లోకి ఇసుక కోసం వస్తుందిగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపుతప్పి పక్కన ఉన్న కాలువలోకి దూసుకు వెళ్ళింది. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాలతో పాటు డ్రైవర్ కు ఎడమ కాలు విరిగినట్లు తెలుస్తుంది. దీంతో అక్కడ ఉన్న గ్రామస్తులు 108 కు స్థానిక పోలీసులకు కాల్ చేసి సమాచారం అందించారు దీంతో సంఘటన స్థలానికి ఎస్సై పి.కోటేశ్వరరావు చేరుకొని ప్రమాదానికి గల కారణాలు పరిశీలించి కేసు నమోదు చేసి డ్రైవర్ను మెరుగైన వైద్యం కోసం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


కాలువలోకి బోల్తాపడిన ట్రాక్టర్

దేశాభివృద్ధిలో ఇందిరాగాంధీ కృషి అపారం

తెనాలిరూరల్: భారతదేశాన్ని ఇతర దేశాలకు దీటుగా అభివృద్ధి చేసే లక్ష్యంతో మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ దేశానికి అత్యున్నతమైన సేవలు అందించారని తెనాలి నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ చందు సాంబశివుడు అన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 40 వర్ధంతిని పురస్కరించుకుని చిట్టి ఆంజనేయ స్వామి గుడి వద్ద గల ఇందిరా గాంధీ విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆమె అందించిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తెనాలి పట్టణ అధ్యక్షుడు పొన్నూరు నాగ సూర్య శశిధర్ రావు, గుంటూరు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు దారా రామకృష్ణ, తెనాలి మండల అధ్యక్షుడు కర్లపూడి బుల్లయ్య, భీమా రమేష్, అయ్యప్ప, కె.కోటేశ్వరరావు, పినపాటి స్టీవెన్ బాబు, టి. శివన్నారాయణ, వై శంకరరావు, కే.వీరాస్వామి, బి. శ్రీను, పూలేరాం, ఎన్ మల్లికార్జునరావు పాల్గొన్నారు.


ఇందిరాగాంధీకి నివాళులర్పిస్తున్న డాక్టర్ సాంబశివుడు, రామకృష్ణ

ఇంటింటా దీపావళి సందడి

- పట్టణంలో జోరుగా సాగిన బాణసంచా విక్రయాలు
- గతేడాదితో పోలిస్తే అధికంగా ఉన్నా.. కొనుగోలు చేసిన జనం
- వాతావరణం అనుకూలించడంతో హోరెత్తిన సంబరాలు

తెనాలి: అనేకానేక సంప్రదాయాల కలయిక, సామాజిక ప్రయోజనాల సమాహారమైన దీపావళి పండుగను పట్టణ, పరిసరాల్లోని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మంచిపై చెడు సాధించే విజయానికి ప్రతీకగా భావించే ఈ పండుగను, అన్ని రకాల చీకట్లను పారద్రోలి వెలుగులు విరజిమ్మేలా చేయటమేనని నమ్ముతారని తెలిసిందే. దీపావళి అంటే బాణ సంచానే అన్నట్టుగా పేద, ధనిక తారతమ్యం లేకుండా ఎవరి స్తోమతతో వారు అట్టహాసంగా చేసుకున్నారు. ఉదయన్నే తలంటు స్నానం చేసి, దేవాలయాలకు వెళ్లి, పూజలు చేసినవారుంటే, ఎంతోమంది ఇళ్లలోని పూజామందిరాల్లో స్వామికి నమస్కారం చేసుకున్నారు.

గారెలు, పొంగలి అన్నం చేసుకుని ఇంటిల్లపాదీ సంతోషంగా ఆరగించారు. దీపావళికి ప్రత్యేకమైన బాణ సంచా విక్రయాలు పట్టణంలో జోరుగా జరిగాయి. ప్రతిఏటా పట్టణ కొత్తపేటలోని తాలూకా కాలేజీ గ్రౌండ్స్‌లో అధికారికంగా బాణ సంచా స్టాల్స్ ఏర్పాటు చేస్తుండగా గత రెండేళ్లుగా ఊరికి వెలుపల గల వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కాలేజీ మైదానంలో నిర్వహణకు అధికారులు అనుమతులిచ్చారు. ఇక్కడి మైదానంలో మొత్తం 50 స్టాల్స్ ఏర్పాటు చేయగా కొనుగోలుదారులతో షాపులన్నీ కళకళలాడాయి. అంగలకుదురు గ్రామం వెలుపల ఐస్ కంపెనీ దగ్గర ఎప్పట్లాగే భారీ బాణాసంచా విక్రయశాల ఏర్పాటుచేశారు. ఈసారి ప్రత్యేకత ఏమంటే తెనాలి–నారాకోడూరు రోడ్డులో జేఎంజే కాలేజీ తర్వాత అంగలకుదురు పొలిమేరల్లో కొన్ని బాణాసంచా విక్రయ దుకాణాలను ఏర్పాటు చేశారు. అన్నిచోట్లా 80 శాతం తగ్గింపు ధరలంటూ బోర్డులు పెడితే, ఈ దుకాణాల్లో మాత్రం 80 ప్లస్ 5 అంటూ బోర్డులు పెట్టి మరీ అమ్మారు. అలాగే బాణ సంచా తాత్కాలిక లైసెన్సుదారులకు మాట ఇచ్చినట్టుగా పట్టణంలోని పలు వీధుల్లో తోపుడు బండ్లపై బాణ సంచా అమ్మకాలను అధికారులు నిరోధించలేకపోయారు. సుల్తానాబాద్ వంటి కొన్నిచోట్ల ఏకంగా దుకాణాలే నడిచాయి. మరో వైపు దీపావళి అంటేనే ముసురుపట్టి వర్షాలతో వాతావరణం కూడా అంతగా అనుకూలించేది కాదు. గురు, శుక్రవారాల్లో వర్షాలు కురుస్తాయంటూ వాతావరణ శాఖ ముందస్తు సూచనలు కూడా ఉన్నాయి. అయినా సరే, ఈ ఏడాది దీపావళి పండుగకు వాతావరణం అనుకూలించింది. పూర్తి పొడిగా ఉండి అనుకూలించడం బాణ సంచా వ్యాపారస్తులకు ఉత్సాహాన్నిచ్చింది. విక్రయాలు కూడా రెండు రోజుల పాటు జోరుగా జరిగాయి. భారీగా పెట్టుబడులు పెట్టి స్టాల్స్ ఏర్పాటు చేసుకున్న వ్యాపారస్తులకు ఈ ఏడాది కలిసొచ్చినట్లుగానే చెప్పుకోవచ్చు.


కిటకిటలాడిన దీపావళి బాణసంచా దుకాణాలు

రేట్లు అధికమైనా...

ఇక రేట్ల విషయానికి వస్తే గడిచిన ఏడాదితో పోలిస్తే ధరలు భారీగా పలికాయి. అదేమిటోగానీ దీపావళి కాకరపువ్వొత్తులు, చిచ్చుబిడ్డు, భూచక్రాలు, విష్ణుచక్రాలు, బాంబుల రేట్లు అదిరిపోయాయి. ఒక్కో ప్యాకెట్‌పై వేలకొద్దీ రూపాయల ధరలు ముద్రించారు. విక్రయాలకు వచ్చేసరికి 80 శాతం, 85 తగ్గింపుతో ఇచ్చారు. ఆవిధంగా చూసుకున్నా చిన్న కుటుంబానికి కనీసం రూ.3,000 వేల పెట్టాల్సి వచ్చిందని చెబుతున్నారు. గతేడాదితో పోల్చుకుంటే దాదాపు 30 నుంచి 40 శాతం రేట్లు అధికంగా ఉన్నాయి. అయినప్పటికీ ఏడాదికోసారి వచ్చే పండగ. ఇంటిల్లిపాదికీ పండగ హుషారు..ఏమాత్రం వెనుకడుగు వేయకుండా టపాసులు కొనుగోలు చేసుకు వెళ్లారు. చీకటి వెలుగుల రంగేళీ... మన దీపావళి... అన్నట్టుగా పండగ సంబరాలు బాగానే హోరెత్తాయి.

తైక్వాండో పోటీల్లో 10 మందికి బంగారు పతకాలు


పతకాలు అందుకున్న విద్యార్థులతో శ్రీనివాసరావు, సత్యం

తెనాలిఅర్బన్: 4వ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో తెనాలి కెఎస్ఆర్ అకాడమికి చెందిన 10మందికి బంగారు పతకాలు, 9 మందికి వెండి పతకాలు, ముగ్గురుకు కాంస్య పతకాలు లభించినట్లు కోచ్ కొక్కిలిగడ్డ శ్రీనివాస రావు తెలిపారు. పోటీలను అక్టోబర్ 26, 27 తేదీల్లో తెనాలిలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆవరణ వెనుక ఉన్న వ్యాయామ మందిరంలో నిర్వహించినట్లు చెప్పారు. వీరికి గురువారం అకాడమీలో మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కుర్రా శ్రీనివాసరావు, అన్నవరపు సత్యం, ఆరాధ్యుల నాగరాజు, కె.కృష్ణ, చంటి,బాలు, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు మరువరానివి

తెనాలిఅర్బన్: సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి అందించిన సేవలు మరువరానివని తెనాలి ఆర్టీసీ డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ కొనియాడారు. వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో ఆయన పోరాట పటిమ అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఉక్కుమనిషిగా పేరు తెచ్చుకున్నారని చెప్పారు. కేంద్రమంత్రిగా, ఆయన అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిపో మేనేజర్ రాజశేఖర్

అష్టలక్ష్మి అమ్మవారికి ధనలక్ష్మి పూజ


దర్శించుకున్న భక్తులు



తెనాలి: ఆశ్వయుజ బహుళ అమావాస్య దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక కొత్తపేటలోని శ్రీఅష్టలక్ష్మి దేవాలయంలో ధనలక్ష్మి పూజలు ఘనంగా నిర్వహించారు. రూపాయి నాణేలకు పూజ చేసి భక్తులకు అమ్మవారి ప్రసాదంగా పంపిణీ చేశారు. పండగ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ద్వాదశ హారతులు, మంగళవాయిద్యాలతో ఆలయం శోభాయమానంగా వెలుగొందింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. దండిస్వాముల ఆశీర్వాదంతో ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీరామచక్రవర్తి పూజలను నిర్వహించారు. ఇటువంటి కార్యక్రమాన్ని తెనాలి ప్రాంతంలో కేవలం అష్టలక్ష్మి దేవాలయంలోనే జరుగుతాయని భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నేటి నుంచి కార్తిక మాసం పూజలు

- కార్తిక శోభను సంతరించుకున్న పెదపులివర్రు శివాలయం
- కాశీలో తరువాత పరస్పరం అభిముఖంగా శివ, వైష్ణవాలయాలు

పెదపులివర్రు(భట్టిప్రోలు): గ్రామంలో కొలువైన బాలా త్రిపురసుందరీ సమేత రాజరాజ నరేంద్రస్వామి (శివాలయం), భూనీళా సమేత వరదరాజస్వామి(వైష్ణవాలయం) దేవాలయాలకు ఒక విశిష్టత ఉంది. ఈ రెండు దేవాలయాలు పరస్పరం అభిముఖంగా ఉండటం విశేషం. ఇలా ఈ ఆలయాలు ఉత్తరాదిన కాశీలో, దక్షిణాదిన బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో ఉండటం గమనార్హం. స్వయంభుగా కొలువై నారద మహర్షియే నిత్య పూజలు అందుకున్న ఆ కై లాసనాథుని దివ్యానుభూతి రూపం రాజరాజ నరేంద్రస్వామిగా కొలువై భక్తులతో నిత్య అభిషేకాలతో ప్రసన్న రూపంతో కనువిందు చేయడం ఇక్కడి విశేషం. వ్యాఘ్రపాద మహర్షి ఆశ్రమం రాజరాజ నరేంద్రుని దృష్టిని ఆకర్షించిన పవిత్ర క్షేత్రం. వ్యాఘ్రపాద మహర్షి కోరికపై కంచి వరదరాజ స్వామి ఇక్కడ వెలిశారు. రామానుజాచార్యులు ఇక్కడ వైష్ణవ ఆలయంలో విడిది చేసి వరదరాజ స్వామిని సేవించడంతో ఈ క్షేత్రం పవిత్ర స్థలంగా ప్రసిద్ధి గాంచింది ఈ దేవాలయాన్ని 1512లో బెజవాడ సామ్రాజ్యాధి నేతలు పునఃప్రతిష్ఠించినట్లు ఈదేవాలయంలో శాసనాలు ఉన్నాయి. కార్తిక మాసం పురస్కరించుకుని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయమంతా కార్తిక శోభ సంతరించుకుంది. కార్తిక మాసంలో భక్తులు వేకువజామున ఆలయానికి తరలి వస్తుంటారు. భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి కార్తిక దీపారాధనలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. శివాలయంలో శనివారం నుంచి కార్తిక మాస దీక్షా అభిషేకాలు, నిత్య కల్యాణాలు, లక్ష బిల్వార్చన, అన్నాభిషేకం, పంచదారాభిషేకం, జ్వాలాతోరణం, సామూహిక కుంకుమ పూజలు, సహస్ర దీపాలంకరణ కార్యక్రమాలు జరగనున్నాయి. పూజలను అర్చకులు ఆమంచి సృజన్ కుమార్ నిర్వహిస్తుండగా కార్యనిర్వాహణాధికారి సాంబశివరావు పర్యవేక్షిస్తున్నారు.


పెదపులివర్రులోని రాజరాజ నరేంద్రస్వామి దేవాలయం